AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
27-6-2026 (Saturday) MAIN EDITION

## సీషెల్స్ పర్యటనకు మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ఉదయం ఢిల్లీ నుండి సీషెల్స్‌కు బయలుదేరారు. సీషెల్స్ రిపబ్లిక్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ఆహ్వానం మేరకు, సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకల్లో 'గెస్ట్ ఆఫ్ ఆనర్' (గౌరవ అతిథి)గా పాల్గొనేందుకు మోదీ జూన్ 27 నుండి 29 వరకు సీషెల్స్‌లో అధికారిక పర్యటన చేపట్టనున్నారు. భారతదేశం, హిందూ మహాసముద్రంలోని ఈ ద్వీపసమూహం మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఆ దేశ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలకు ప్రధాన అతిథిగా ప్రధాని మోదీ హాజరుకానున్నారు.

## భారత్‌కు ట్రంప్ కృతజ్ఞతలు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన పేరుతో హైదరాబాద్ నగరంలో రోడ్డును ఏర్పాటు చేయడం అపూర్వ గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్‌కు ఆనుకుని ఉన్న రోడ్డుకు "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ" అని ఇటీవల పేరు పెట్టిన విషయం తెలిసిందే. దీంతో ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. దీనిని "అపూర్వ గౌరవం"గా అభివర్ణించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన చిత్రాన్ని పంచుకున్నారు. భారతదేశంలోని హైదరాబాద్‌లో కొత్త 'డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ' ఈ విధంగా గౌరవించబడిన మొట్టమొదటి అమెరికా అధ్యక్షుడు నేనే. ధన్యవాదాలు అని ట్రంప్ పేర్కొన్నారు.

## పిడుగుపాటుకు 21 ఆవులు మృతి



అక్షరటుడే, ములుగు : ములుగు జిల్లా తాడ్వాయి మండలం అంకంపల్లిలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఉరుములతో కూడిన వాతావరణంలో పిడుగు పడటంతో రైతు సమ్మయ్య కు చెందిన 21 ఆవులు అక్కడికక్కడే మరణించాయి. ఈ ఘటనతో రైతుకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది.

## కూకట్‌పల్లిలో ఆక్రమణల కూల్చివేత




అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ: జీహెచ్ఎంసీ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ ఎంఆర్‌వో ఆఫీస్ లైన్‌లో అక్రమ నిర్మాణాలను తొలగించారు. రోడ్లు, ఫుట్ పాత్‌లను ఆక్రమించి ఇష్టారా జ్యంగా నిర్మించిన కట్ట డాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ స్థానిక ప్రజల నుండి ఫిర్యాదులు రావడంతో చర్యలు చేపట్టారు.

## 'క్రిమినల్‌కు కులం అంటగడతారా..'




అక్షరటుడే, ఏపీ: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక కుర్రాడు 14 ఏళ్ల బాలికను హింసిస్తే.. అలాంటి వాడికి వత్తాసుగా వెళ్తారా అని ప్రశ్నించారు. ఆ తల్లి పడే బాధ తనకు తెలుసన్నారు. కేవలం మీ కులమైతే సరిపోతుందా? ఓ క్రిమినల్‌ను ఎలా వెనకేసుకొస్తారు అని ఆయన మండిపడ్డారు.

## వీఐపీల సెక్యూరిటీ తగ్గింపు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మావోయిస్టుల ముప్పు దాదాపు తొలగిపోవడంతో భద్రతా సమీక్ష కమిటీ నిర్ణయం మేరకు 100 మందికి పైగా వీఐపీల సెక్యూరిటీని జులై 1 నుంచి తగ్గించనుంది. దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఉనికి దాదాపుగా కనుమరుగైంది. ఆపరేషన్ కగార్‌తో చాలా మంది ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. వందలాది మంది పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. మావోయిస్ట్ పార్టీ సెక్రెటరీ దేవ్‌జీ సైతం లొంగిపోయారు. దీంతో దేశంతో పాటు రాష్ట్రంలో మావోయిస్టుల ముప్పు తొలగిపోయింది. ఈ క్రమంలో వీఐపీల భద్రతను తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

# హైడ్రా భారీ ఆపరేషన్

హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. చెరువులు, నాలాలతో పాటు ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలను కబ్జా చెరల నుంచి విడిపిస్తోంది. తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ మండలం, ఓల్డ్ బోయిన్‌పల్లి సమీపంలోని హస్మత్‌పేట్‌లో ఆక్రమణలను తొలగించింది. రూ.750 కోట్ల విలువైన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



■ హస్మత్‌పేటలో ప్రభుత్వ భూమి ఆక్రమణ ■ రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా ■ భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు

హస్మత్‌పేటలోని సర్వే నంబర్ 01లో 108 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే ఇందులో 98 ఎకరాలను ఇప్పటికే ఆక్రమించుకున్నారు. అక్కడ ఎంతో మంది ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. మిగిలిన పది ఎకరాలను సైతం కబ్జా చేయడానికి పలువురు యత్నించారు. దీంతో రెవెన్యూ అధికారులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో హైడ్రా సిబ్బంది శనివారం ఉదయం రంగంలోకి దిగారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు ఏర్పాటు చేసిన అక్రమ ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్‌లను, తాత్కాలిక షెడ్‌లను కూల్చివేశారు.

### వాటి జోలికి వెళ్లకుండా...

హస్మత్‌పేటలోని సర్వే నెం.1లో తొలుత 108 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు తెలిపారు. 98 ఎకరాలు ఆక్రమణకు గురికాగా.. అందులో నివాస లేఅవుట్లు, ఇళ్ళు వచ్చాయి. నివాసితుల ఉనికిని దృష్టిలో ఉంచుకుని, హైడ్రా తన చర్యను మిగిలిన ఖాళీగా ఉన్న 10 ఎకరాలకు పరిమితం చేసింది. 98 ఎకరాల జోలికి వెళ్ల కుండా.. మిగిలిన భూమిని కాపాడింది. హైడ్రా కాపాడిన 10 ఎకరాల భూమి విలువ రూ.750 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

### నాయకుల హస్తం

ప్రభుత్వ భూమిని ప్రతిపక్ష నేతలు, మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధుల అండదండలతోనే కబ్జా చేసి అమ్మకాలు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇక్కడ పలు నిర్మాణాలు వెలిశాయి. అన్యాక్రాంతమైన ఈ భూమిని కాపాడేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల సమక్షంలో కూల్చివేతలు చేపట్టారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో, పోలీసుల భద్రత మధ్య హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ఆక్రమణదారులు భూమిపై కబ్జా చేసేందుకు ముందస్తుగా సరిహద్దు గోడలు, తాత్కాలిక షెడ్లు నిర్మించారని హైడ్రా పేర్కొంది. ఆస్తిని కాపాడటానికి తమ సొంత మనుషులను మోహరించారని తెలిపింది.

## భారత్‌లో పర్యటించనున్న ట్రంప్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ప్రారంభంలో భారత పర్యటనకు వచ్చే అవకాశం ఉందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. పర్యటనకు సంబంధించిన సన్నాహాలను పూర్తి చేసేందుకు తాను ఈ ఏడాది చివరిలోగా భారత్‌ను సందర్శించాలని భావిస్తున్నట్లు మార్కో రూబియో వెల్లడించారు. అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని నరేంద్ర మోదీ మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధం, దౌత్యపరంగా ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య బంధం "అద్భుతంగా" ఉందని, ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఒక ప్రపంచ శక్తిగా ఎదిగిందని రూబియో ప్రశంసించారు. భారత్‌అమెరికా దేశాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు.

## ప్రభుత్వ హామీలన్నీ అమలు చేస్తాం: పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం అన్ని హామీలను నెరవేరుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వాస్తవాలను వక్రీకరిస్తూ కొందరు కార్మిక సంఘాల నాయకులు ప్రజలను, కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, ఆర్టీసీ ఉన్నతాధికారులు , సుమారు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో 14 గంటల పాటు సుదీర్ఘ చర్చలు జరిపామని మంత్రి గుర్తు చేశారు. అందరి ఆమోదంతోనే ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. మొత్తం 32 డిమాండ్లలో 29 యాజమాన్య పరిధిలో, 3 ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. యాజమాన్య పరిధిలోని అంశాలను ఈడీల కమిటీ ద్వారా పరిష్కరిస్తున్నామని చెప్పారు.

## భర్త వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య

**అక్షరటుడే, మెదక్:** మెదక్ జిల్లాలో అమానుష ఘటన చోటు చేసుకుంది. భార్యపై అనుమానంతో కడుపులో ఉన్న బిడ్డకు డీఎన్ఏ పరీక్ష చేయాలని ఓ భర్త వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఐదు నెలల గర్భిణి ఆత్మహత్య చేసుకుంది. వికారాబాద్ జిల్లా కోటపల్లి మండలం మోత్కుపల్లికి చెందిన సుస్మిత (23)కు ఏడాదిన్నర క్రితం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌కి చెందిన గాజుల అభిలాష్‌తో వివాహం జరిగింది. సుష్మిత ఇప్పుడు 5 నెలల గర్భిణి. అయితే ఆమె గర్భానికి తాను కారణం కాదని అభిలాష్ అనుమానం పెంచుకున్నాడు. భార్యపై అనుమానంతో పుట్టబోయే బిడ్డకు డీఎన్ఏ పరీక్ష చేయాలని నిత్యం వేధించేవాడు. దీంతో ఇంట్లో గొడవలు జరిగేవి. భర్తతో పాటు అత్త సైతం సుష్మితను వేధించేది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది.

## ఇల్లు అప్పగింత జాప్యానికి పరిహారం కోరే హక్కు ఉంది: సుప్రీం



**అక్షరటుడే, ఢిల్లీ:** ఇల్లు లేదా ఫ్లాట్ స్వాధీనం చేసుకున్నంత మాత్రాన, నిర్మాణంలో జరిగిన జాప్యానికి పరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం కీలక తీర్పును వెలువరించింది. ఢిల్లీకి చెందిన ఒక వ్యక్తి 2003లో ఒక గృహ నిర్మాణ సంఘంలో ఫ్లాట్ కొనుగోలు చేశారు. అయితే, ఆ ఫ్లాట్ అప్పగించడంలో భారీగా ఆలస్యం జరిగింది. దీంతో సదరు కొనుగోలుదారుడు పరిహారం కోరుతూ వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో సుప్రీంను ఆశ్రయించారు. న్యాయస్థానం స్పందిస్తూ.. ఫ్లాట్ స్వాధీనం తీసుకున్నంత మాత్రాన, ఆరోపిత జాప్యానికి పరిహారం కోరే హక్కు రద్దు కాదని కోర్టు స్పష్టం చేసింది. స్వాధీనానికి ముందు నుంచే నష్టపరిహార దావా వేసే హక్కు కొనుగోలుదారుకు ఉంటుందని తెలిపింది.

## ప్రముఖ దర్శకుడు భాగ్యరాజ్ మృతి



**అక్షరటుడే, చెన్నై:** తమిళ చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ దర్శకుడు, నటుడు భాగ్యరాజ్ (73) శనివారం ఉదయం మృతి చెందారు. ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆయన, పలు చిత్రాల్లో నటుడిగా సైతం మెప్పించారు. గుండెపోటుతో భాగ్యరాజ్ తుదిశ్వాస విడిచారు. భాగ్యరాజ్ తమిళ చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ దర్శకుడు, నటుడు, రచయిత, నిర్మాత. ఆయన 75కి పైగా చిత్రాలలో నటించారు. ప్రత్యేకమైన కథాంశాలు, హాస్యంతో కూడిన కుటుంబ కథా చిత్రాలను రూపొందించడంలో మంచి గుర్తింపు ఉంది. ఆయన మరణం పట్ల అభిమానులు, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

## వెనిజులా భూకంపం.. 920 మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వెనిజులాలో ఈ నెల 24న వరుసగా రెండు భారీ భూకం పాలు సంభవించాయి. ఈ విపత్తు ధాటికి వందలాది భవనాలు, అపార్ట్‌మెంట్లు నేలమట్టమయ్యాయి. స్థానిక ప్రభుత్వ అధికారిక గణాంకాల ప్రకారం.. ఇప్పటివరకు 920 మంది ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతుండగా, అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించిన సమాచారం ప్రకారం ఏకంగా 50వేల మందికి పైగా ప్రజలు గల్లంతయ్యారు. కూలిపోయిన భారీ కట్టడాల శిథిలాల కింద వీరు చిక్కుకొని ఉండవచ్చని భావిస్తున్నారు.

## 'నేనే పెద్ద 'జెన్ జీ'ని'



**అక్షరటుడే, ఏపీ:** ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఏపీ సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కిష్టంశెట్టిపల్లిలో 'సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్' ను ప్రారంభించిన ఆయన.. 'ప్రస్తుతం అందరూ జెన్ జీ గురించి మాట్లాడుతున్నారు, నేనే అందరికంటే పెద్ద జెన్ జీని. నా కంటే ఇన్నోవేటివ్ గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు' అని వ్యాఖ్యానించారు. పెద్ద కుటుంబాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు.. కీలక వ్యక్తి అదుపులోకి..



**అక్షరటుడే, ఏపీ:** విజయవాడ కృష్ణలంక రాజీవ్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి మృతి ఉదంతంపై సిట్ అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. లాకప్‌లో సాయికృష్ణను చిత్రహింసలకు గురిచేసి చంపేసిన ఘటనలో, పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో సీఐ నాగరాజుకు సన్నిహితుడైన సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కీలక సమాచారాన్ని సేకరిస్తున్నారు.

## వైసీపీ వర్సెస్ టీడీపీ.. అమరావతిలో ఉద్రిక్తత



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు హీట్ ఎక్కాయి. మొన్నటి వరకు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్న నాయకులు తాజాగా దాడులకు దిగుతున్నారు. తాజాగా అమరావతిలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైసీపీ నాయకులు శనివారం అమరావతి పర్యటనకు నిర్ణయించారు. రాజధాని భూములను పరిశీలించడానికి నాయకులు వెళ్లారు. పేర్నినాని, లేళ్ల అప్పిరెడ్డి, సీఆర్డీఏ పరిరక్షణ బృందం సభ్యులు అమరావతికి వెళ్లగా.. వారిని టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. మరోవైపు వైసీపీ నేతల పర్యటనకు నిరసనగా ఉండవల్లి సెంటర్‌లో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, టీడీపీ శ్రేణులు ధర్నా చేశాయి. వైసీపీ నేతలు గో బ్యాక్ నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా 'అమరావతి'ని అంగీకరించాకే పర్యటించాలని డిమాండ్ చేశారు.